



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
21-03-2026
పేజీలు: 02




## ఒకేసారి 3 నెలల రేషన్ పంపిణీ!


రేషన్ లబ్ధిదారులకు కేంద్రం శుభవార్త అందించనున్నట్లు సమాచారం. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన ఉచిత రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్రాలకు ఆహార, ప్రజా పంపిణీ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరులోపు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎండల తీవ్రతతో పాటు గోదాముల్లో ధాన్యం నిల్వలు అధికంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# రంజాన్ ముబారక్!



ఆకాశంలో నెలవంక దర్శనమివ్వగానే ముస్లిం సోదరుల ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో చేసిన కఠిన ఉపవాస దీక్షలకు ముగింపు పలుకుతూ, మార్చి 21, 2026న ముస్లింలు ఎంతో ఘనంగా జరుపుకోబోయే పర్వదినమే ఈద్ ఉల్ ఫితర్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం తొమ్మిదవ నెల రంజాన్. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ అవతరించింది. అందుకే ఈ నెలను అత్యంత పవిత్రంగా భావిస్తారు. వేకువజామున సహేరితో మొదలై, సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్తో ముగిసే ఉపవాసాలు కేవలం కడుపు మాడ్చుకోవడం కాదు.. మనసును, ఇంద్రియాలను అదుపులో ఉంచుకునే ఒక గొప్ప ఆధ్యాత్మిక సాధన. ఆ కఠిన దీక్షల విజయవంతమైన ముగింపే ఈద్ ఉల్ ఫితర్.





## కరీంనగర్ టూటౌన్ ఎస్సై ఆత్మహత్య

**మూడు రోజుల కిందట భార్య.. ఇప్పుడు భర్త..**

కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు. చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం.



## టమోటా కిలో రూ.7

మండలంలోని కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా కిలో గరిష్ఠ ధర రూ.7తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 24టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. సరాసరి ధర రూ.5, కనిష్ఠ ధర రూ.3తో విక్రయాలు జరిగాయన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుతో సిద్దిపేట దరిదాపుల్లో

# కరువు మాటే లేదు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు.



## పెద్దపులి సంచారం

కొడిమ్యాల మండలంలో పెద్దపులి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గంగారం తండా గ్రామంలో ఇటీవల రెండు ఆవులపై పెద్దపులి దాడి చేసి వాటిని చంపేసింది. ఈ ఘటనల కారణంగా గ్రామస్థులు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి.. పులి సంచారాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి పులి కదలికలను పరిశీలిస్తున్నారు. గ్రామస్థులు, రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



## గ్యాస్ కోసం జనం బారులు

వంట గ్యాస్ కష్టాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. రానున్న రోజుల్లో సిలిండర్లు దొరకడం కష్టమంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ కావడంతో జనం గ్యాస్ సిలిండర్ కోసం ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. శుక్రవారం బోయినపల్లి కేంద్రంలోని గ్యాస్ గోడౌన్ వద్ద వందలాది మంది వినియోగదారులు సిలిండర్ల కోసం క్యూలైన్‌లో నిల్చున్నారు. గ్యాస్ బుక్ చేసినా నివాసాల వద్దకు గ్యాస్ సిలిండర్లు రాకపోవడంతో వినియోగదారుల్లో ఆందోళన పెరిగిపోయింది. దీంతో సిలిండర్ల కోసం ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. శనివారం రంజాన్ పండుగ నేపథ్యంలో ముస్లింలు ఎక్కువగా గ్యాస్ గోదాం వద్ద క్యూకట్టారు.




## బ్యాండ్ మేళం ట్రైలర్ విడుదల

టాలీవుడ్ ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పణలో, సతీష్ జవ్వాజి దర్శకత్వంలో తెరకెక్కిన మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'బ్యాండ్ మేళం' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన ఈ చిత్రంలో సీనియర్ నటుడు సాయి కుమార్ కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ట్రైలర్ గమనిస్తే, ఇది ఒక పక్కా పల్లెటూరి నేపథ్య ప్రేమకథగా కనిపిస్తోంది.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు.. సిట్ బృందానికి చిక్కిన డ్రగ్ పెడ్లర్



తెలుగు రాష్ట్రాల్లో మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సిట్ దర్యాప్తు చేపట్టిన ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ ORR వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. తాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు ? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.



# అప్పట్లో భయం వేసింది: ఈషా రెబ్బా

ఈషా రెబ్బా తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం నిరంతరం ప్రయత్నిస్తున్న నటీమణుల్లో ఒకరు. 'అంతకు ముందు ఆ తర్వాత' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన ఈషా, 'అరవింద సమేత వీరరాఘవ', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి పెద్ద చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించింది. అందం, అభినయం ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో పెద్ద అవకాశాలు రాకపోవడం తన కెరీర్‌లో ఒక లోటుగానే ఉందని చెప్పుకోవచ్చు. నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈషా రెబ్బా, ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'అరవింద సమేత వీరరాఘవ' సినిమాలో నటించిన అనుభవాలను ఓపెన్‌గా పంచుకుంది.అయితే కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ కాకుండా వేరే పాత్రలు చేస్తే, భవిష్యత్తులో కూడా అలాంటి రోల్స్‌కే పరిమితం చేస్తారేమో అన్న భయం అప్పట్లో తనలో ఉందని అంగీకరించింది. మొదట తనది లీడ్ రోల్ అని చెప్పడంతో హ్యాపీగా ఫీలయ్యానని, కానీ స్టీరియోటైప్ అవుతానేమో అన్న టెన్షన్ కూడా వెంటాడిందని వివరించింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## టెన్నిస్ చాలా కష్టంగా అనిపిస్తోంది

మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 ఇగా స్వియాటెక్ (Iga Swiatek) మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్గ లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్‌కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయం చవిచూసింది మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్గ లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 6-1, 5-7, 6-3తో స్వియాటెక్‌కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్‌లో తొలి రౌండ్‌లో 73 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది. ఊహించని పరాజయం అనంతరం మాట్లాడుతూ.. 'నేను ఓడిపోయానంటే నమ్మబుద్ధి కావడం లేదు. రాను రాను టెన్నిస్ ఆట కష్టంగా అనిపిస్తోంది . ఈ ఆట చాలా తేలిక అనుకున్నా. కానీ, కోర్టులో మానసికంగా మనం ఎలా ఉంటామనేది చాలా కీలకం. ఇది నాకొక చెత్త మ్యాచ్. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటా. మళ్లీ నా పనిలో మునిగిపోతా. ప్రాక్టీస్ చేస్తాను. పాజిటివ్‌గా ఆలోచిస్తూ.. నా ఆటను మెరుగుపరచుకుంటా' అని స్వియాటెక్ చెప్పింది.

## ఎల్పీజీ సిలిండర్.. 14.2 కేజీల వెనుక రహస్యం ఇదే!




ప్రస్తుతం ఎల్పీజీ కొరత కారణంగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఎల్పీజీ సిలిండర్‌లో ఎప్పుడూ 14.2 కేజీల గ్యాస్ ఎందుకు ఉంటుందనే ప్రశ్నకు సమాధానం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దీని వెనుక ఉన్న మూడు ప్రధాన కారణాలు సేఫ్టీ, ఇంజనీరింగ్ లెక్కలు, మరియు ఒక కుటుంబానికి నెల రోజుల అవసరాలు. 1950వ దశకంలో బర్మా షెల్ అనే సంస్థ ఈ బరువును నిర్ధారించింది. గ్యాస్‌తో కలిపి సిలిండర్ బరువు 29.5 కేజీలు ఉంటుంది, ఇది మోయడానికి సులభంగా ఉంటుంది.



## దక్షిణ కొరియా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం.. 10 మంది మృతి

దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. డేజియాన్ నగరంలోని ఒక ఆటో విడిభాగాల తయారీ కర్మాగారంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 10 మంది కార్మికులు మరణించగా, 59 మంది గాయపడ్డారు. వీరిలో 25 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత ఫ్యాక్టరీ భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో అధికారులు రోబోలను రంగంలోకి దింపి, భవనాన్ని చల్లబరిచాక గాలింపు పనులు చేపట్టారు. ప్రమాద సమయంలో లోపల చిక్కుకుపోయిన మరో నలుగురు కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పైనుంచి దూకగా, మరికొందరు పొగ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యూంగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 500 మంది అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. మంటలను అదుపులోకి తెచ్చిన సిబ్బంది, ఫ్యాక్టరీలోని 100 కిలోల ప్రమాదకర రసాయనాలను సురక్షితంగా బయటకు తరలించారు. దీంతో మరో పెద్ద ముప్పు తప్పిందని అధికారులు వెల్లడించారు. అయితే, అసలు ప్రమాదానికి కారణం ఏమిటనే దానిపై స్పష్టత రాలేదు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

## మే 14న సూర్య 'కరుప్పు' విడుదల



సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్న చిత్రం 'కరుప్పు'. గురువారం ఉగాది సందర్భంగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. సమ్మర్ స్పెషల్‌గా మే 14న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విడుదలైన పోస్టర్‌లో సూర్య ఇంటెన్స్ లుక్‌లో ఆకట్టుకుంటున్నాడు. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.




## కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్
# ఏప్రిల్ 1 నుంచి భారీ మార్పులు

ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ పూర్తిగా మారనున్నాయి. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు 2026ను కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 అమలు చేసేందుకు కొత్త రూల్స్ తీసుకొచ్చారు. పన్ను చెల్లింపుదారులను ఈ కొత్త నియమాలు ప్రభావితం చేయనున్నాయి. ఒక ఆస్తిని ఎంతకాలం పాటు కలిగి ఉండచ్చనే దానిపై హెల్డింగ్ పీరియడ్ విషయంలో స్పష్టతను కొత్త రూల్స్ ఇస్తున్నాయి. బాండ్లు, డిబెంచర్లు, డిపాజిట్ సర్టిఫికేట్లు తర్వాత షేర్లు, డిబెంచర్లుగా మార్చితే హోల్డింగ్ పీరియడ్ జరిగిన సమయం నుంచి తెక్కించరు. పెట్టుబడిదారులు అసలు పత్రాన్ని ఎంతకాలం కలిగి ఉన్నాడో ఆ వ్యవధిలో కలుపుతారు.ఇక ఆదాయ ప్రకటన పథకం 2016 ప్రకారం ప్రకటించిన ఆస్తులకు ప్రత్యేక నిబంధనలు ఉంటాయి. భూమి, ఇల్లు, స్థిరాస్తి, రిజిస్టర్ దస్తావేజు ఉన్నట్లయితే.. దానిని కలిగి ఉన్న కాలాన్ని అసలు కొనుగోలు తేదీ నుంచి లెక్కిస్తారు. ఇక ఇతర ఆస్తుల విషయానికొస్తే.. కలిగి ఉన్న కాలాన్ని 2016, జూన్ 1 నుంచి లెక్కిస్తారు.ఇక విదేశీ కంపెనీ శాఖను దేశంలో అనుబంధ సంస్థగా మార్చితే.. బదిలీ చేయబడిన ఆస్తులు యాజమాన్య కాలం కూడా చేర్చుతారు. విదేశీ బ్రాంచ్ లేదా యజమాని కలిగి ఉన్న కాలం ఉంటుంది. ఇక కంపెనీల డివిడెంట్ల ప్రక్రియను మరింత కఠినతరం చేశారు. ఇక నుంచి దేశంలోని కంపెనీలు తమ పార్టనర్ల పూర్తి రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించుకోవాలి. ఇక డివిడెండ్‌ను ఆమోదించే వార్షిక సర్వసభ్య సమావేశం భారత్‌లోనే జరగాలి. ఇక డివిడెండ్ల చెల్లింపులు కూడా భారత్‌లో జరపాలి. లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించేందుకు, పన్ను సమ్మతిని బలోపేతం చేడం, పన్ను ఎగవేతలను తగ్గించేందుకు ఈ కొత్త రూల్స్ ఉపయోగపడనున్నాయి. ఇక వివాదాలను కూడా తగ్గిస్తుంది.

## హుక్కా సెంటర్లపై ఏసీపీ దాడులు
# 37 మంది యువకులు అదుపులోకి



హైదరాబాద్‌లోని నాగోలు, ఎల్బీనగర్ పరిధిలో హుక్కా సెంటర్లపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 37 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీగా హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లో ఉన్న శెహరి కేఫే హుక్కా సెంటర్ పై ఏసీపీ కృష్ణయ్య తన బృందంతో కలిసి ఆకస్మిక దాడి చేశారు. స్థానిక సీఐకి కూడా సమాచారం లేకుండా స్వయంగా ఏసీపీనే రంగంలోకి దిగి తనిఖీలు జరపడం గమనార్హం. ఈ క్రమంలో అక్కడ హుక్కా సేవిస్తున్న 25 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి భారీగా హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎల్బీనగర్‌లోని ఎల్వీసీ హుక్కా సెంటర్‌లోనూ తనిఖీలు నిర్వహించారు. అక్కడ 12 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదుపులోకి తీసుకున్న యువకుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించినట్లు తెలిపారు. రిపోర్టుల ఆధారంగా వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, నిబంధనలు ఉల్లంఘించి హుక్కా సెంటర్లు నడిపినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



## భారత్-ఐర్లాండ్ టీ20 సిరీస్
# షెడ్యూల్ ఖరారు

టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత క్రికెట్ జట్టు తన తదుపరి సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరుగుతాయి. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టు ఆడబోయే తొలి టీ20 సిరీస్ ఇదే కావడం విశేషం. ఐపీఎల్ 2026 ముగిసిన అనంతరం టీమిండియా తొలుత ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. జూన్ 20న వన్డే సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు బయలుదేరుతుంది. ఈ సిరీస్ పూర్తికాగానే జులై 1 నుంచి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది. "సీనియర్ పురుషుల జట్టు 2026 జూన్‌లో ఐర్లాండ్‌లో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం పర్యటిస్తుంది" అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు (2018, 2022, 2023) ఐర్లాండ్‌లో పర్యటించినప్పటికీ 2007 తర్వాత బెల్‌ఫాస్ట్‌లో ఆడటం ఇదే తొలిసారని బోర్డు వివరించింది.

## కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్న కేట్ శర్మ

బికినీలో తన నాజూకు అందాలను హైలైట్ చేస్తూ కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ. కేట్ శర్మ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ పిక్స్ చూసిన వారంతా హాట్, ఉఫ్, స్టన్నింగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొద్ది గంటల్లోనే ఫొటోలకు లక్షల్లో లైకులు వచ్చాయి.సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ కనిపించే కేట్ శర్మ.. తరచు నెట్టింట బోల్డ్ ఫొటో షూట్లతో ఆకట్టుకుంటూ ఉంటుంది.కేట్ శర్మ జులై 19, 1997న భారతదేశంలోని మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. రూహ్‌దార్ , పరమావతార్ శ్రీ కృష్ణ, తు మేరీ జిందగీ వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకుంది.సినిమాల్లో పెద్దగా కనిపించకపోయినా.. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోజులతో కుర్రకారును ఫిదా.

